క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో భాగంగా రూ.500కే గ్యాస్‌సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలుచేయడంతో కాంగ్రెస్ నాయకులు గురువారం పార్టీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, నాయకులు ఢీకొండ శ్యాంగౌడ్, రాంబాబు, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో బీసీలకు లక్ష కోట్లను ఖర్చు పెడతామని చెప్పి, మొన్నటి బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లు ప్రకటించడం చూస్తే బీసీలపై ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం బీసీలను విస్మరించిందని బీజేపీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బల్ల రమేశ్, సీనియర్ నాయకులు తులా మధుసూధన్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ ఫెడరేషన్లకు పాలకమండలి ఏర్పాటు చేసి, దానికి చట్టబద్ధత కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో 50శాతం బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలని, స్థానిక సంస్థలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ ఇస్తూ, అన్ని కులాలకు అవకాశం వచ్చేలా ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలన్నారు. బీసీ సమాజానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి బహుజనులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'గృహజ్యోతి' పాఠశాలలకు అమలు చేయాలి


మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు

కోటపల్లి: రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేసి పాఠశాలలన్నింటికీ ఉచితవిద్యుత్ ఇవ్వాలని సంబంధించిన బకాయిలను రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయసంఘం తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేవులవాడలో తపస్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ... 200యూనిట్ల లోపు వాడే పేదవారికి ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేయడాన్ని హర్షం వ్యక్తం చేశారు. పేదవారిని గుర్తించడంలో ప్రభుత్వం సరైన ప్రమాణాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, మహేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల కరపత్రాలు ఆవిష్కరణ

బెల్లంపల్లి: 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం విద్యార్థులకు అవగాహన కల్పించడానికి గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరఫున కరపత్రాలను విడుదల చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో సామూహికంగా కరపత్రాలను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. న్యాక్ గుర్తింపు కలిగిన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరుగుతోందని, పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు, క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి క్యాంపెయినింగ్‌కు వెళ్లి ఇంటర్మీడియెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై అవగాహన

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో గురువారం రక్షణ చర్యలపై షీ టీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై రాజశేఖర్ సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జి ఎస్సై హైమ, హాస్టల్ ఇన్‌చార్జి సంధ్యారాణి, చీఫ్ లీగల్ అడ్వకేట్ సంధాని, అసిస్టెంట్ సదయ్య బ్లూ కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిలదీత

- వాడీవేడిగా చెన్నూర్ కౌన్సిల్ సమావేశం
- అధికారులను ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- రోగులకు అందించే భోజనంలో నాణ్యత కరువైందంటూ ఆరోపణ


మిషన్ భగీరథ ఏఈ సరితను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్

చెన్నూర్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రజా సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డా అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అధికారులు అభివృద్ధి పనులపై ఎజెండాను చదివి విన్పించారు. 50పడకల ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, పురుగుల మందు సేవించి ప్రాణపాయస్థితిలో ఆసుపత్రికి వచ్చిన రోగులను స్ట్రెచర్ పై తీసుకెళ్లేందుకు హెల్పర్లు లేకపోవడంతో రోగుల బంధువులే తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని అధికారులను 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ప్రశ్నించారు. అలాగే భోజనం చేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రోగులకు అందించే భోజనం నాణ్యతపై దృష్టి సారిస్తామన్నారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులను తీసుకెళ్లేందుకు వార్డు బాయ్స్ ఉన్నారని, ఎవరైనా అందుబాటులో లేని సమయంలో అలా జరిగి ఉంటుందన్నారు. ఆసుపత్రిలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి కాలం ప్రారంభమైనప్పటికీ మిషన్ భగీరథ పనులు పూర్తి చేయకపోవడంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 1వ వార్డు కౌన్సిలర్ పోగుల సతీశ్, కమ్మల శ్రీనివాస్ ఏఈ సరితను ప్రశ్నించారు. నెల రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంభాలకు విద్యుత్ దీపాలు అమర్చలేదని, ఆయా కాలనీల వాసులు చీకటిలో మగ్గాల్సిన దుస్థితి నెలకొందని 7వ వార్డు కౌన్సిలర్ జగన్నాధుల శ్రీనివాస్ అధికారులను నిలదీశారు. పనులు ఆలస్యం కావడంతో వీధి దీపాలు ఏర్పాటు చేయడం జాప్యం జరిగిందని త్వరలోనే వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని ఏఈ తెలిపారు. 4వ వార్డులో నిర్మించిన ట్యాంక్ లీకేజీలు, ట్యాప్‌లు, ట్యాంక్ పై కప్పు పనులు పూర్తి కాకుండానే కౌన్సిలర్‌కు తెలియకుండా క్లియరెన్స్ ఎలా ఇస్తారని మున్సిపల్ ఏఈ సాయికిరణ్‌ను 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అడిగారు. ఏఈ మాట్లాడుతూ క్లియరెన్స్ ఇవ్వలేదు, మైనర్ పనులు ఉన్నట్లు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. మార్చి 8న జరిగే మహా శివరాత్రి పండగ సందర్భంగా గోదావరి స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సభ్యులు కోరారు. ఏర్పాట్ల కోసం రూ.లక్ష నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. గోదావరి నది వరకు సింగరేణి అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం, మహాంకాళి వాడ నుంచి గోదావరి నది వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను తొలగిస్తామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో తొమ్మిది తీర్మానాలు


మాట్లాడుతున్న కమిషనర్ మురళీకృష్ణ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం తొమ్మిది అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఫాగింగ్ మెషీన్ కొనుగోలు, మున్సిపల్ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చేందుకు అయ్యే ఖర్చు రూ.5.50లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వెచ్చించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపునకు అవసరమైన మందులు, మొక్కలు, ఇతర సామగ్రి, నల్లమట్టి కొనుగోలుకు అంచనా వ్యయం రూ.5.50లక్షలు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, ఏఈ అచ్యుత్, టీపీఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం


ఆర్‌కే 6 గని పై ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనుల్లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందుతున్న పలువురు ఉద్యోగులకు ఆయా గనులపై అధికారులు గురువారం ఘనంగా సన్మానాలు నిర్వహించారు. ఆర్‌కే 6 గనిపై ఎస్.కిషన్‌రావు కోల్ కట్టర్, నాలాల రాయమల్లు కోల్ కట్టర్, కోట రాజమల్లు హాలేజి ఆపరేటర్, దురుసెట్టి మొగిళి జనరల్ మజ్దూర్ ఉద్యోగులను గని మేనేజర్ తిరుపతి సన్మానించారు. అధికారులు శ్రీనివాస్, కొమురయ్య, శ్యాం కుమార్, మహేశ్, పిట్ సెక్రటరీ సంఘం సధానందం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే 7గనిపై పదవీ విరమణ పొందుతున్న మామిడి రాజమల్లు జనరల్ మజ్దూర్, ఎస్.మహేందర్ లైన్‌మెన్, కుశెట్టి వెంకటేశ్వర్లు ట్రామర్, బత్తుల లక్ష్మణ్ ట్రామర్లను గని మేనేజర్ శ్రీధర్, రక్షణాధికారి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు కొట్టె కిషన్‌రావు, అధికారులు ప్రవీణ్, సుధీర్, రమేశ్ పాల్గొన్నారు. ఆర్‌కే న్యూటెక్ గనిపై లక్ష్మారెడ్డి ట్రామర్ పదవీ విరమణ పొందగా ఆయనను ఎస్‌ఓఎం స్వామిరాజు ఘనంగా సన్మానించారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై గురువారం ఉద్యోగ విరమణ పొందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు నీలం సమ్మయ్యను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు కార్మికులకు ఆత్మీయ సన్మానం జరిగింది. గని ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు కార్మికులు చిలుముల మల్లేష్(కేబుల్ మ్యాన్), మెరుగు హన్మయ్య (కేబుల్ మ్యాన్), షేక్ గోరి(బిట్ షార్ప్‌నర్) దంపతులకు పూలమాల వేసి శాలువా కప్పి గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హా సన్మానం చేశారు.

పాతపద్ధతిలో నియమించాలి

నస్పూర్: ఏరియాలోని వివిధ గనులలోని సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను పాత పద్ధతి ప్రకారం గతంలో నియమించినట్లు గానే అండర్‌గ్రౌండ్ జనరల్ మజ్దూర్‌లనే నియమించాలని పలువురు జనరల్ మజ్దూర్‌లు కోరారు. జనరల్ మజ్దూర్‌లు గురువారం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

భూమిపూజ

తాండూర్: మండలంలోని నర్సాపూర్ పునరావాస గ్రామంలో హన్‌మాన్ ఆలయ నిర్మాణానికి బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ (జీఎం) డి.రవి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై గురువారం భూమిపూజ చేశారు.

కృత్రిమ గర్భధారణపై అవగాహన

దండేపల్లి: పశువుల్లో కృత్రిమ గర్భధారణ, పశుగ్రాసం పెంపకంపై మండలంలోని మాదాపూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి ధన్‌రాజ్ మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణతో మేలు రకమైన పశు సంపద అభివృద్ధి చెందుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

పౌరహక్కుల దినోత్సవం

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామ పంచాయతీలో గురువారం జాతీయ పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ హాజరై ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కులపై వివరించారు.

హక్కులు అందరికీ వర్తిస్తాయి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చట్టంలోని హక్కులు ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయని, ఆ హక్కులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమాజంలో అంతా మేలు జరుగుతుందని హాజీపూర్ తహసీల్దార్ సతీశ్ కుమార్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హాజీపూర్ మండలం నంనూర్ పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

పోలింగ్ విధానంపై అవగాహన

జన్నారం: త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా గురువారం జన్నారం గ్రామ పంచాయతీలో పోలింగ్‌పై ఎంపీటీసీ రియాజోద్దీన్ అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో గ్రామస్తులకు వివరించారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు విద్యాశాఖ చేపట్టిన అవగాహన, ప్రేరణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ సూచించారు. దండేపల్లి మండలంలోని ముత్యంపేట ఓ పంక్షన్ హాల్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సైకలాజిస్ట్ ఖాసీం మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని, ఆందోళన చెందకూడదని తెలిపారు.

సమీక్ష

వేమనపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలకు వంద రోజుల పని పూర్తయ్యేలా చూడాలన్నారు.

'ఓరియంట్' ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కాసిపేట: మండలంలోని దేవాపూర్, గట్రావుపల్లి గ్రామపంచాయతీలలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎముకల వైద్య నిపుణులు, స్త్రీల వైద్యనిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సుమారు 160మంది శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్ ఎం.పి.జోషి, జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ ఆనంద్ కులకర్ణి, లైసనింగ్ అధికారి కె.తిరుపతి, వైద్యులు కే.గౌతమ్, లక్ష్మి ప్రసన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి ఇష్టపడి చదవండి

- 'ప్రేరణ'లో డీఈవో యాదయ్య


విద్యార్థులతో డీఈవో, అధికారులు

జన్నారం: విద్యార్థులు భయం వీడి ఇష్టపడి చదివితే అన్నింట్లో విజయం సాధించవచ్చని జిల్లా విద్యాధికారి యాదయ్య పేర్కొన్నారు. కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు గురువారం జన్నారం మండలకేంద్రంలోని పైడిపెల్లి గార్డెన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం ద్వారా పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నపత్రాలను అవగాహన చేసుకుని, జవాబులు స్పష్టంగా రాయలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత తర్వాత అనేక అంశాలపై చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రూపు 1, గ్రూపు 2, ఐఏఎస్, ఇంజనీర్, డాక్టర్ లాంటి ఉద్యోగాలు సాధించాలంటే ఎలా చదువుకోవాలో తెలిపారు. కష్టపడి చదివితే ఏ ఉద్యోగాన్నైనా సాధించవచ్చని సూచించారు. నిపుణులు అందించే సూచనలు, సలహాలు పాటించి ఉన్నత చదువులకు సిద్ధం కావాలన్నారు. ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా సమర్థవంతంగా పరీక్షలపై పట్టు సాధించాలన్నారు. ప్రేరణ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సైకలాజిస్టులు ప్రకాశ్, కవిత, కాసింలు విద్యార్థులకు భయం పోగొట్టే విధంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి చౌదరి, సత్యనారాయణ మూర్తి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో రమేశ్, వైద్యులు శివదాస్, చంద్రిక, రాజన్న, నగేశ్, వివిధ పాఠశాల హెచ్‌ఎంలు కట్ట రాజమౌళి, కొండు జనార్దన్, రామన్న, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బోదకాలు' నివారణ కోసం రక్త నమూనాల సేకరణ


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

భీమారం: బోదకాలు నివారణ కోసం జైపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి 300మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపించి బోదకాలు నిర్ధారణ అయితే మందులు అందిస్తామని పేర్కొన్నారు.

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లిలో వైద్యురాలు ఉమశ్రీ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ కోసం గురువారం రక్త నమూనాలు సేకరించారు. 300మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఫైలేరియా ప్రాథమిక దశలో ఉందని, ఉన్నత అధికారుల సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని వైద్యురాలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్‌లు పోచయ్య, కమలాకర్, దీవెన తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల గైర్హాజర్‌తో నిలిచిన ఎన్నిక


ప్రజాప్రతినిధుల కోసం వేచి చూస్తున్న ఎన్నికల ఆఫీసర్ చిన్నయ్య, ఎంపీడీవో రాధ

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజర్ కావడంతో ఎన్నిక నిర్వహించలేదు. ఈ మేరకు ఓటింగ్ జరగని విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి నివేదించనున్నట్లు ఎన్నికల ఆఫీసర్ చిన్నయ్య తెలిపారు. బుధవారం నిర్వహించిన సభకి ఇద్దరు సభ్యులు హాజరుకాగా గురువారం రెండోసారి నిర్వహించిన సభకు ముగ్గురు హాజరుకాలేదని ఆయన పేర్కొన్నారు. మండలంలో మొత్తం నాలుగు ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో మద్దికల్ ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందిన సమ్మయ్య ఉపాధ్యక్షుడిగా కూడా కొనసాగారు. అయితే ఆయిన సర్పంచ్‌గా పోటీ చేసిన సమయంలో ఎన్నికల ఖర్చులు వివరాలు ఎన్నికల సంఘానికి అందించలేదనే ఆరోపణతో ఆయనను మూడేళ్ల క్రితం ఎంపీటీసీగా అనర్హుడిగా ప్రకటించింది. దీనితో ఇప్పుడు ఉన్న ముగ్గురు ఎంపీటీసీలతో ఉపాధ్యక్షుడిని ఎన్నుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఎంపీపీ చెర్కు దీపికా రెడ్డి(భీమారం–2), చేకూర్తి సరోజన(భీమారం–1), పెద్దల రూప(కాజిపల్లి)లు హాజరుకాలేదు. దీంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. తిరిగి వీటిని ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో మాదకద్రవ్యాల నివారణపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తాయన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల మాదకద్రవ్యాల నివారణ కమిటీ అధ్యక్షుడు ఎంవీ పట్వర్ధన్, విద్యార్థులు, అధ్యాపక బృందంతో మాదక ద్రవ్య నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కిశోర్‌కుమార్, సంతోష్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ తిరుపతి ఐఅండ్ ఏసీ కో–ఆర్డినేటర్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చే చెడు పరిణామాలు ఏంటో, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి వాటి నివారణ ఎలాగో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, అధ్యాపకులు జగ్‌పాల్, కృష్ణగోపాల్, శ్రీనివాస్, ఎండి సర్వర్‌పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా..!

- కొత్తమామిడిపల్లిలో 'మిషన్ భగీరథ' తీరు
- పట్టించుకోని అధికారులు


మిషన్ భగీరథ నీటిట్యాంకు

దండేపల్లి: ఇంటింటికీ నల్లా నీరందించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. అంతా బాగానే ఉన్నా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొన్నిచోట్ల పథకం నీరు గారిపోతోంది. దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లి గ్రామానికి గ్రిడ్ పైప్‌లైన్ ద్వారా సరఫరా కావాల్సిన నీళ్లు ట్యాంకు ఎక్కడం లేదు. గ్రామంలో గత 20రోజుల నుంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సంబంధిత అధికారులు ఏమి పట్టించుకోకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో 60వేల లీటర్ల నీటి ట్యాంకు నిర్మించారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఎల్లంపల్లి నుంచి గ్రిడ్ పైప్‌లైన్ ద్వారా వచ్చేనీరు ప్రెషర్ లేకపోవడంతో ట్యాంక్‌కు ఎక్కడం లేదు. దీంతో నీటిసరఫరా నిలిచిపోవడంతో ప్రజలు గోస పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం సమీపించడంతో బావులు, బోర్లలో నీళ్లు అడుగంటే ప్రమాదం ఉంది. ఇలాంటి తరుణంలో భగీరథ పథకం ద్వారా వచ్చే నీటితో ఇక్కట్లు తీర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ సరఫరా నిలిచిపోయింది. తాగునీటి బావులు, బోర్లు లేకుండా భగీరథ నీటిపై ఆధారపడ్డ చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయనుకుంటే, ప్రత్యేకాధికారులు అంతంతా మాత్రంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోసైతంది



భగీరథ నల్లా నీళ్లు రాకపోవడంతో నీళ్లకు గోసైతంది. మాకు బావి లేకపోవడంతో భగీరథ నీళ్లు వస్తే మాకు నీళ్లకు గోస ఉండేది కాదు. సుమారు 20రోజుల నుంచి నీళ్లు బంద్ కావడంతో ఇబ్బంది అయితంది. బోరింగ్ కాడికి పోయి తెచ్చుకుంటున్నాం.

– కట్ట జయ, కొత్త మామిడిపల్లి

త్వరలో పరిష్కరిస్తాం

గ్రిడ్ పైప్‌లైన్ ద్వారా కొత్త మామిడిపల్లి నీటి ట్యాంక్‌కు నీళ్లు ఎక్కడం లేదు. ప్రెషర్ సరిపోకపోవడమే కారణం. ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

– అరుణ్, గ్రిడ్ ఏఈఈ



పడిపోతున్న మంచి'ర్యా'ల

మంచిర్యాల జిల్లా పట్టణంలోని ఐబీ చౌరస్తాలో మున్సిపల్ నిధులతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లోని మంచి మంచిర్యాల అక్షరాలు ఒక్కొక్కటిగా పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే 'ర్యా' నేడో రేపో పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. మిగత అక్షరాలు కూడా పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. రూ.లక్షల నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన రెండేళ్లకే అక్షరాల పరిస్థితి ఇలా ఉంది.

– మంచిర్యాల టౌన్